సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం | 4 | అక్టోబర్ | 2024

గరిష్టం/కనిష్టం
34.4/24.1

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగటిపూట వేడిగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వృద్ధుల సంక్షేమానికి అనేక చట్టాలు

ఆదిలాబాద్‌టౌన్: వయోవృద్ధుల సంక్షేమం కోసం రాజ్యాంగం అనేక చట్టాలను రూపొందించిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. గురువారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ పేరెంట్స్ మెయింటనెన్స్ యాక్ట్ వచ్చిందని, తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నవారికి పిల్లల ద్వారా రూ.10 వేల చొప్పున ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు లక్ష్మారెడ్డి, దేవిదాస్ దేశ్‌పాండే, తదితరులు పాల్గొన్నారు.

2వ బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్ షురూ



స్వాగతం పలుకుతున్న దేవిదాస్ రాథోడ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ శివారులో గల తెలంగాణ 2వ పోలీస్ బెటాలియన్‌లో గురువారం స్పోర్ట్స్ మీట్ ప్రారంభమయ్యాయి. బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్ క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బందికి మూడు రోజుల పాటు అథ్లెటిక్, స్పోర్ట్స్ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ దేవిదాస్ రాథోడ్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ప్రధాన మంత్రి యశ్వవి స్కాలర్ షిప్ పథకానికి 9, 10, ఇంటర్ చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోగా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని హార్డ్ కాపీలను పాఠశాల స్థాయిలో చదివే విద్యార్థులు సంబంధిత హెచ్‌ఎంకు, ఇంటర్ విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలన్నారు. 9, 10 తరగతి విద్యార్థులకు ఏడాదికి రూ.75వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.1.25 లక్షలు స్కాలర్ షిప్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

నేటి నుంచి సోయా కొనుగోళ్లు షురూ

కైలాస్‌నగర్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సోయా కొనుగోళ్లను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.4,892తో సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పాయల్ శంకర్, బోథ్ నియోజకవర్గంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన సరుకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం



రథానికి పూజలు చేస్తున్న ఎంపీ నగేశ్

బోథ్: గ్రామాల్లో ఆలయాల నిర్మాణం, బ్రహ్మోత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. గురువారం మండలంలోని సొనాల గ్రామంలో రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల కోసం నూతనంగా తయారు చేయించిన శ్రీరామరథానికి ఎంపీ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సొనాల గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి విజయవంతం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ జీవి.రమణ, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సదానందం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగె బ్రహ్మానందం, ముస్తాపురె అశోక్, ఆదినాథ్, తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కానుక లేనట్టే!?

- ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు
- చీరల పంపిణీపై ఇప్పటి వరకూ రాని స్పష్టత
- సర్కారు నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న ఆడపడుచులు

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు, సభ్యుల వివరాలు
జిల్లాలోని మండలాలు : 17
గ్రామ సమైక్య సంఘాలు : 557
స్వయం సహాయక సంఘాలు : 10,784
సభ్యులు : 1,17,490

కైలాస్‌నగర్: బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే కానుకలు ఈసారి లేనట్లుగానే కనిపిస్తోంది. బతుకమ్మ చీరల పంపిణీని రద్దు చేస్తున్నామని, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు మాత్రమే ఏడాదికి రెండు చీరలను ఉచితంగా అందజేస్తామని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ దానిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఓ దశలో చీరలకు బదులుగా ఆడపడచులకు ఒక్కొక్కరికి రూ.500 నగదును వారి ఖాతాల్లో జమచేసేలా ఆలోచిస్తున్నట్లుగా ప్రచారం జరిగింది. కానీ దీనిపైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు బతుకమ్మ వేడుకలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. ఆడపడచులు తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలతో సందడి చేస్తున్నారు. అయితే ప్రభుత్వం బతుకమ్మ కానుకగా ఏం ఇస్తుందా? అనే దానిపై మహిళలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా దృష్టి సారించకపోవడంతో ఈ యేడు కానుకలు లేనట్లుగానే తెలుస్తోంది.

గత ప్రభుత్వంలో చీరల పంపిణీ

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కొన్నేళ్ల పాటు ఆడపడుచులకు చీరలను కానుకగా అందించింది. బతుకమ్మ వేడుకల ప్రారంభానికి ముందుగానే జిల్లాకు అవసరమైన చీరలను పంపించేది. వాటిని డీఆర్‌డీఏ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఎంతో ఆర్భాటంగా పంపిణీ చేసేవారు. రేషన్ కార్డు కలిగి ఉండి, 18 ఏళ్ల వయస్సు నిండిన యువతులు, మహిళలందరికీ ఈ చీరలను అందించేవారు. గతేడాది జిల్లాలోని 17 మండలాలకు గానూ 2,63,250 చీరలను ప్రభుత్వం పంపించింది. అందులో ఎన్నికల కోడ్ వచ్చే నాటికి అధికారులు 2,57,340 చీరలను మహిళలకు అందజేశారు. ఎన్నికల కోడ్ కారణంగా మరో 5,910 చీరలు పంపిణీ చేయకుండా మిగిలిపోయాయి. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన చీరల నాణ్యతపైన అప్పట్లో పలువురు మహిళలు అసహనం వ్యక్తం చేశారు. పలుచోట్ల చీరలను దగ్ధం చేసిన మహిళలు అప్పటి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళనలను సైతం చేపట్టారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ సైతం చీరల నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే వాటి పంపిణీని రద్దు చేసినట్లుగా తెలుస్తోంది.

ఎస్‌హెచ్‌జీ మహిళలకు మాత్రమే...

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు మాత్రమే ఏడాదికి రెండు చీరలను ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గిపోయే అవకాశముంది. అయితే ప్రభుత్వం ఇచ్చినా అవి కూడా ప్రస్తుత బతుకమ్మ పండుగకు అందేలా కన్పించడం లేదు. బతుకమ్మ వేడుకలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. దసరా పండగ సైతం మరో 9 రోజుల్లోనే ఉంది. ఇప్పటికిప్పుడు చీరలను జిల్లాకు పంపించినా పంపిణీ చేయడం అసాధ్యంగానే మారనుంది. కాగా చీరలకు బదులుగా రూ.500 నగదును మహిళల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందనే చర్చ సైతం జోరుగా సాగింది. దీనిపై మహిళల్లో హర్షం వ్యక్తమైంది. ప్రభుత్వం చీరలకు బదులుగా నగదు జమచేస్తుందనే ప్రచారం వారిలో ఆనందం నింపింది. అయితే దీనిపై మంత్రులు కానీ, ప్రభుత్వం కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అది ప్రచారంగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మ కానుకలను అందిస్తుందా? లేక వాటిని రద్దు చేస్తుందా? అనేదానిపై ప్రస్తుతం మహిళావర్గాల్లో ఆసక్తి కర చర్చ సాగుతోంది. సర్కారు నిర్ణయంపై వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే అధికారికవర్గాల్లో మాత్రం ఈ యేడు బతుకమ్మ కానుకలు ఉండకపోవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయమై డీఆర్‌డీవో హెచ్‌ఆర్ విభాగం, బతుకమ్మ చీరల పంపిణీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌ను సంప్రదించగా ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు. ప్రభుత్వం ఇస్తుందా? లేదా? అనేదానిపై కూడా తమకు సమాచారం లేదని స్పష్టం చేశారు.



ప్రతిష్ఠాపనకు తరలుతున్న అమ్మవారు

దుర్గాదేవీ నమోస్తుతే..

- మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు
- ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారిని ప్రతిష్ఠించారు. విద్యుత్ దీపాల వెలుగులతో సుందరంగా తీర్చిదిద్దిన మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు భక్తులు భవాని దీక్షను స్వీకరించగా నవమి వరకూ కొనసాగించనున్నారు. – ఆదిలాబాద్



విద్యానగర్ హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమ

టీచర్ల భర్తీతో నాణ్యమైన విద్యాబోధన

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల భర్తీతో పేద విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యాబోధన అందనుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు 1:3 పద్ధతిన సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, జిల్లాలో 324 పోస్టులు భర్తీ కానున్నాయన్నారు. ఈనెల 5 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎనిమిది కమిటీల ద్వారా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అభ్యర్థులను హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామన్నారు. త్వరలో మరో డీఎస్సీ వేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. మొదటి రోజు 113 మంది, రెండో రోజు 225 మంది సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందన్నారు. ఇందులో 155 మంది ఎస్జీటీ, 54 స్కూల్ అసిస్టెంట్, 15 లాంగ్వేజ్ పండిట్, ఒక పీఈటీలకు సంబంధించి సర్టిఫికెట్లను పరిశీలించారన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.



ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్, డీఈవో

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పరిశీలన

ఆదిలాబాద్‌రూరల్: పైలెట్ ప్రాజెక్టు ప్రోగ్రాంలో ప్రతీ కుటుంబానికి సంబంధించిన వివరాలు ఇచ్చిన ఫార్మాట్‌లో తప్పులు లేకుండా పూరించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన లోహరలో డిజిటల్ కార్డుల సర్వే విధానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి యజమానిగా మహిళ పేరు ఉండాలని, అనంతరం కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలన్నారు. వివరాలు పొందుపర్చిన అనంతరం ఫోన్‌లో ఫొటో తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో ఆనంద్ పాల్గొన్నారు.

యూనియన్ ఎన్నికల్లో ధన ప్రవాహం

- ఉపాధ్యాయ సంఘంలో రెండు ప్యానళ్ల మధ్య తీవ్ర పోటీ
- వారం రోజులు ఈవినింగ్ క్యాంపులు
- లక్షల్లో ఖర్చుకు వెనుకాడని వైనం..
- కొత్త సంస్కృతికి తెర లేపారన్న విమర్శ
- ప్రభుత్వ టీచర్లలో చర్చకు దారి

సాక్షి, ఆదిలాబాద్: పాఠశాలల్లో విద్యార్థులకు మన దేశ ఎన్నికల విధానంపై అవగాహన కలిగించేందుకు మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని వివరిస్తూ ఎన్నికలు ఏవిధంగా జరుగుతాయో చిన్నారులకు ప్రత్యక్షంగా జరిపి చూపిస్తారు. 'ఓటు మనహక్కు' అని తెలియజేస్తూ ఏ ఎన్నికలు జరిగినా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని పిల్లలకు టీచర్లు ఉద్బోధిస్తారు. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు గురికావొద్దని సూచిస్తారు. స్కూళ్లలో ఓటు ప్రతిజ్ఞ చేయిస్తారు. ఇలా మన ఎన్నికల తీరును తెలియజేస్తారు. కానీ సమాజానికి దారి చూపించాల్సిన ఉపాధ్యాయులే పక్కదారి పట్టారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ సంఘం ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేశారు. మద్యం ఏరులై పారింది. రెండు ప్యానళ్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనగా ఎత్తుకు పైఎత్తు వేసి రాజకీయ పార్టీల ఎన్నికలను తలపించేలా వ్యవహారం సాగింది. జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు 99 ఓట్లు మాత్రమే ఉండగా ఈ ఎన్నికల కోసం ఒక ప్యానల్ రూ.10లక్షల వరకు, మరో ప్యానల్ రూ.5 లక్షల వరకు ఖర్చు చేసిందని ప్రచారం జరుగుతుంది. ఇప్పుడు ఉపాధ్యాయ సంఘాలన్నింటిలోనూ ఈ ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికల ద్వారా సమాజానికి ఉపాధ్యాయులు ఏం సంకేతమిచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల ఎన్నికలంటే.. మండలాల నుంచి టీచర్లను ఓటింగ్ కేంద్రం వరకు తీసుకొచ్చేందుకు, వారి భోజనాలు, ఇతరత్రా ఖర్చులకు స్వల్పంగా ఖర్చు చేసేవారని చెప్పుకుంటున్నారు. ఈ ఎన్నికల ద్వారా టీచర్ సంఘాల ఎలక్షన్లు ఖరీదుగా మారిపోయాయన్న ప్రచారం సాగుతోంది. పోటీ చేయాలనుకునే వారు లక్షల్లో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పలువురు పేర్కొంటున్నారు.

ఎన్నికలు ఇలా..

గత ఆదివారం ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఆదిలాబాద్ శివారులో ఉన్న ఓ గార్డెన్స్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో కొమ్ము కృష్ణకుమార్ ప్యానల్, కుడాల రవీందర్ ప్యానళ్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మండలాల వారీగా కొన్ని ఓట్లు, మొత్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 99 ఓట్లలో మెజార్టీ సాధించిన వారికి విజయం వరిస్తుంది. దీనికోసం ఈ రెండు ప్యానళ్లు వారం రోజుల క్రితం నుంచే తమ అనుకూలురు అయినటువంటి ఓటర్లకు ప్రతిరోజు సాయంత్రం మందు, విందు క్యాంపులను కొనసాగించారు. ఓటింగ్‌కు ఒకరోజు ముందు ఎత్తుకు పైఎత్తు వేస్తూ ఒక్కొక్క ఓటుకు వేల రూపాయలు వెచ్చించారని చెప్పుకుంటున్నారు. నేరుగా వారి అకౌంట్‌లోనే డబ్బులు వేసినట్లు ప్రచారం సాగుతోంది. ఈ ఎన్నికల్లో కొమ్ము కృష్ణకుమార్ ప్యానల్ విజయం సాధించింది. అయితే ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రస్తుతం ఉపాధ్యాయుల్లో, అన్ని సంఘాల్లో ఈ ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు కూడా ఇంత పోటీ కనిపించేది కాదని, విజయం సాధించేందుకు ప్యానళ్లు ఇంత దిగజారుడుగా వ్యవహరించడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: జిల్లాలోని పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ యార్డుల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ పత్తి కొనుగోళ్లపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు, అధికారులు, వ్యాపారులు, రైతు సంఘాల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా వర్గాల నుంచి కొనుగోళ్ల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అభిప్రాయాలు స్వీకరించారు. పత్తి విక్రయించిన 2, 3 రోజుల్లోనే రైతులకు డబ్బులు చెల్లించాలని, ప్రభుత్వ రంగసంస్థలు పత్తి కొనుగోళ్లకు రంగంలో ఉండేలా చూడాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరుగకుండా చూసేందుకు అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో కమిటీలను నియమించాలని, రైతు ఆధార్ సీడింగ్ ఉన్న బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమ అయ్యేలా వారికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తూకాల్లో ఎలాంటి తేడాలు రాకుండా కాంటాలను ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తనిఖీ చేయాలని కోరారు. వ్యాపారులు మాట్లాడుతూ 16 జిన్నింగ్ మిల్లులు ఉండగా అందులో రెండు మాత్రమే రెన్యూవల్ అయ్యాయని మిగతావి నవంబర్‌లో రెన్యూవల్ అవుతాయన్నారు. విద్యుత్ సబ్సిడీని అక్టోబర్ నుంచే అందించేలా చూడాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తేమశాతం 12కు మించకుండా పత్తిని తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది తలెత్తిన లోటుపాట్లకు ఆస్కారం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పత్తి క్వింటాల్‌కు రూ.7,521 కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. తేమ శాతం 8కి మించకుండా పత్తి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు పటేల్, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఏవో శ్రీధర్ స్వామి, మార్కెటింగ్ ఏడీ గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు

కైలాస్‌నగర్: జిల్లాలో ఖరీఫ్ వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి సన్నరకం, దొడ్డు రకం ధాన్యం సేకరణకు విడివిడిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని సకాలంలో మిల్లులకు చేరేలా రవాణా సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాళ్లు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. సమావేశంలో ఎస్పీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, డీఎస్‌వో వాజీద్ అలీ, డీఎం సివిల్ సప్‌లై సుధారాణి, డీసీవో మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత చాటిచెప్పేలా దసరా ఉత్సవాలు

ఆదిలాబాద్: ఆధ్యాత్మికత చాటి చెప్పేలా దసరా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రామ్ లీలా మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా వేడుకలకు సంబంధించిన ఏర్పాట్ల పనులను గురువారం ప్రారంభించారు. ప్రతిఒక్కరూ జీవితంలో ధర్మపరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, కౌన్సిలర్ ప్రకాష్, సమితి గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, రవీందర్ సూర్యకాంత్, సంతోష్, శ్రీను, మహిపాల్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ జోగు ప్రేమేందర్

నేనూ ఆడబిడ్డ తండ్రినే... ఆ కష్టాలేంటో తెలుసు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: ఆడపిల్ల పెళ్లి చేయాలంటే ఆ తల్లిదండ్రులు పడే బాధలేంటో తనకు తెలుసని, తాను కూడా ఆడబిడ్డకు తండ్రినేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని 235 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద మంజూరైన ఆర్థికసాయం చెక్కులను గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఆదిలాబాద్ అర్బన్‌లో 67 షాదీ ముబారక్, 115 కల్యాణలక్ష్మి, మావల మండలంలో 23 కల్యాణలక్ష్మి, 7 షాదీ ముబారక్, ఆదిలాబాద్ రూరల్ మండలంలో 23 కల్యాణలక్ష్మి చెక్కులను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పొందడం ప్రజల హక్కని, వాటి కోసం మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం చెక్కులకు బదులుగా నేరుగా డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ప్రభుత్వాలు ఏవైనా పేదల సంక్షేమం కోసమే పని చేస్తాయన్నారు. పెళ్లయిన వారం, పది రోజుల్లో చెక్కులు ఇప్పించేలా చూడాలని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్, వేణుగోపాల్, ఆర్‌ఐలు నారాయణ, యజువేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్కూరి లక్ష్మీ గార్డెన్ సమీపంలో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మృతునికి సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, కొన్నిరోజులుగా ఆయాప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నాడన్నారు. అనారోగ్యం బారిన పడి మృతి చెంది ఉంటాడన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామని, సంబంధీకులు ఉంటే 87126 59925 నంబరులో సంప్రదించాలన్నారు.

మహిళను వేధించిన వ్యక్తికి రెండు నెలల జైలు

కడెం: మహిళను వేధించిన వ్యక్తికి రెండు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నర్సింహ కథనం ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి గణేశ్ తనను వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ 2015లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచరణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఖానాపూర్ కోర్టులో ఏపీపీ దేవేందర్ సాక్షులను హాజపర్చగా నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమనా విధించారు.

మట్టి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

భీమారం: మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో ప్రభుత్వ భూముల నుంచి మట్టి తరలించిన మెండె పున్నం(జేసీబీ యజమాని), బొల్లం శ్రీనివాస్(ట్రాక్టర్ల యజమాని)లపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. రెండు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నామని, జేసీబీ కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. కొంతకాలంగా ప్రభుత్వ భూ ముల నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారని తహసీల్దార్ సదానందం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మైనింగ్ శాఖ అనుమతితోనే మట్టి తరలించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

75 కిలోమీటర్లు కాలినడకన...


మహోర్ నుంచి వస్తున్న గిరిజనులు

తాంసి(బోథ్): ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని శాంతినగర్ వాసులు మూడేళ్లుగా తమ గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శారదాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఇందులో భాగంగా మండపంలో వెలిగించే అఖండజ్యోతి కోసం 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్రలోని మహోర్ దేవస్థానం నుంచి కాకడ హారతి తీసుకొచ్చారు. గురువారం వేకువజామున మహోర్ రేణుకామాత దర్శనం చేసుకుని కాకడ హారతి చేతపట్టుకుని కాలినడకన రాత్రి గ్రామానికి చేరుకున్నారు. కొలాం గిరిజనులు ఆచారం ప్రకారం పూజలు నిర్వహించి అఖండ జ్యోతి వెలిగించారు. గ్రామస్తులపై రేణుకామాత అనుగ్రహం ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొదటిసారిగా కాలినడకన వెళ్లి కాకడ హారతి తీసుకొచ్చినట్లు గ్రామ పెద్ద దిలీప్ తెలిపారు.

మాకు స్వేచ్ఛనీయండి

జన్నారం: దట్టమైన అడవుల్లో స్వేచ్ఛగా బతకాలనుకుంటాం.. మేము ఎవరికీ హాని చేయం.. అడవితల్లి ఒడిలో అలరాడుతుంటే కొందరు స్వార్థపరులు మాకు ఉచ్చులు బిగుస్తున్నారు.. బరిసెలతో పొడిచి, కరెంటు పెట్టి, మందు ప్రయోగాలు వంటి దుశ్చర్యలకు పాల్పడుతూ మమ్మల్ని హతమారుస్తున్నారు. మా మాంసాన్ని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మా కోసం అనేక చట్టాలున్నా అవి వారికి చుట్టాలుగానే మారుతున్నాయట.. మా బాధలను గుర్తించి రక్షణ కల్పించండి.. ఏటా అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మిమ్మల్ని వేడుకుంటున్నాం.

– ఇట్లు.. మీ వన్యప్రాణి

- వన్యప్రాణుల సంరక్షణకు అనేక చట్టాలు
- కవ్వాల్..వన్యప్రాణుల కలయిక
- కొనసాగుతున్న వన్యప్రాణి వారోత్సవాలు


కుంటలో నీరు తాగుతున్న నీలుగాయిలు (ఫైల్)


అడవిలో ఏర్పాటు చేసిన నీటికుంట


వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన గడ్డిక్షేత్రాలు

రక్షణ కవచంలా..
దట్టమైన అడవిగా కవ్వాల్ అభయారణ్యం విస్తరించింది. 1965లో వన్యప్రాణుల విభాగంగా(వైల్డ్‌లైఫ్)గా ఏర్పాటు చేశారు. 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టం అమలైంది. 2012లో నేషనల్ టైగర్ అథారిటీ, కేంద్రప్రభుత్వం కవ్వాల్ అభయారణ్యాన్ని పులుల రక్షిత ప్రదేశం (టైగర్‌జోన్)గా ఏర్పాటు చేసింది. ఈ అభయారణ్యం 2,015 స్క్వేర్ కి.మీ వైశాల్యంతో ఉంది. 893 చదరపు కి.మీ. కోర్ ఏరియా, 1123 చదరపు కి.మీ. బఫర్ ఏరియాగా గుర్తించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టైగర్‌జోన్ వ్యాపించి ఉంది. చుక్కల దుప్పి, నీలుగాయిలు, దుప్పులు, సాంబర్లు, కొండగొర్రెలు, జింకలు, కుందేళ్లు, ముళ్లపంది తదితర వాటితోపాటు పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు వన్యమృగాలు స్వేచ్ఛగా జీవించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ టైగర్‌జోన్ ఏర్పాటు నుంచి వన్యప్రాణులకు రక్షణ కవచంగా మారింది. కఠిన చట్టాల అమలుతో వన్యప్రాణుల వేట తగ్గుముఖం పట్టింది.

డివిజన్‌లో సౌకర్యాలు..
జన్నారం అటవీ డివిజన్‌లో వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. 40 బీట్లలో గడ్డి క్షేత్రాలను విరివిగా ఏర్పాటు చేశారు. నీటి కుంటలు, అవాసానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గత మూడేళ్లుగా అడవుల్లోకి పశువులు వెళ్లకుండా కట్టడి చేశారు. అలజడి లేకపోవడంతో వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది. ఇందుకుతోడు ఆహారం కోసం వివిధ రకాల గడ్డి పెంచడం, నీటి కుంటల నిర్మాణం, అలజడి లేకుండా అవాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య రెట్టింపయినట్లు అధికారులు తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



వన్యప్రాణుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అడవిలో గడ్డిక్షేత్రాలు, నీటి సౌకర్యం కల్పిస్తున్నాం. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. వేట కూడా తగ్గింది. వన్యప్రాణుల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతాం.

– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీ అధికారి

కఠిన చట్టాలు..
వన్యప్రాణులను వేటాడినా, వాహనంతో ఢీకొట్టి చంపిన కఠిన చట్టాలున్నాయి. 1972 యాక్ట్ ప్రకారం 6 నెలల నుంచి 8 ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా ఉంది. షెడ్యూల్ 1 కిందికి వచ్చేపులి, చిరుత, ఎలుగుబంటి, లాంటి అంతరిస్తున్న జంతువులను వేటాడితే 8 ఏళ్ల జైలు శిక్ష ఉంటుంది. షెడ్యూల్ 2 కిందికి వచ్చే మిగతా జంతువుల వేటాడి చంపితే 6 నెలల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

అక్టోబర్ 2 నుంచి వారోత్సవాలు
అక్టోబర్ 2 నుంచి 7 వరకు 70వ వన్యప్రాణి వారోత్సవాలను డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అవగాహన ర్యాలీ, ఫుట్ పెట్రోలింగ్, విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం, బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు


పట్టుబడ్డ నిందితులతో ఎస్సై సుగుణాకర్

నస్పూర్: పట్టణ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను సీసీసీ నస్పూర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నెల్కి సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగల్‌పహాడ్‌లోని క్రషర్ మిల్ సమీపంలో ఏడుగురు వ్యక్తులు గంజాయికి అలవాటుపడి భద్రాచలం నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అందరూ పంచుకోవడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను పట్టుకోగా.. మరో నలుగురు పారిపోయారు. పట్టుబడ్డ గోదారి రాజు, జాడి వంశి, సాయికుమార్ నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గని మేనేజర్‌పై కేసు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్‌ఖదీర్‌పై శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. గనిలో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు దేవి శ్రీనాథ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గని మేనేజర్ వద్దకు వెళ్లి తనకు ఫ్యాన్ ఆపరేటర్ పని ఇవ్వాలని కోరగా అందుకు ఆయన నిరాకరించడంతోపాటు కులం పేరుతో దూషించడానికి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆగని భూ ఆక్రమణలు..!

- ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో బోర్డుల ఏర్పాటు
- బేఖాతర్ చేస్తున్న అక్రమార్కులు

బెల్లంపల్లి: రెవెన్యూ డివిజన్ కేంద్రం బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతూనే ఉన్నాయి. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా అక్రమార్కులు బేఖాతార్ చేస్తున్నారు. గత శుక్రవారం కాల్‌టెక్స్ ఏరియా 12, 13వ మున్సిపల్ వార్డుల మధ్యలో కబ్జాకు యత్నించగా.. సర్వేనంబర్ 104లోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు చట్టరీత్యా శిక్షార్హులని పేర్కొన్నారు. అదేమీ లెక్క చేయకుండా హెచ్చరిక బోర్డును ఆనుకుని రాత్రికి రాత్రే షెడ్డు నిర్మించడం సంచలనం సృష్టించింది. ఆ స్థలం హైకోర్టు పరిధిలో ఉందని, అడ్డుకునే చర్యలకు పాల్పడితే కోర్టు ధిక్కరణకు గురవుతారని ప్రతి బోర్డును ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఓ శాశ్వత కట్టడాన్ని కూల్చివేశారు. ఇప్పటికే ఎంతో విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. మిగిలిన కొద్దిపాటి భూములపైనా కన్నేసి వదలకుండా ఆక్రమణకు తెగబడుతున్నారు. కాల్‌టెక్స్ ఏరియా, గంగారాం నగర్, కన్నాల, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణకు అక్రమార్కులు చేయని ప్రయత్నం లేదు. గతంలో కన్నాల శివారు జాతీయరహదారి పక్కన అప్పటి ఆర్డీవో ఆయేషా మస్రత్ ఖానమ్, బెల్లంపల్లి తహసీల్దార్ శ్యామలదేవి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి జేసీబీ, ట్రాక్టర్‌లతో దగ్గరుండి కూల్చివేయించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా భూ కబ్జా ఆగకపోవడాన్ని పుర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. సింగరేణి ఏరియా ఆసుపత్రి ముందు, అంబేద్కర్‌నగర్, రాంనగర్, అశోక్‌నగర్, బూడిదగడ్డ బస్తీ, షంషీర్ నగర్, మహ్మద్ ఖాశీంబస్తీ, బెల్లంపల్లి బస్తీ, కాంటా చౌరస్తా, కన్నాల బస్తీ, కొత్త బస్టాండ్ ఏరియా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన తదితర ప్రాంతాల్లో పాతిన హెచ్చరిక బోర్డులు పత్తా లేకుండా పోయాయి. భూ ఆక్రమణల వెనుక ప్రభుత్వ అధికారుల హస్తం ఉందనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన పలువురు లోపాయికారిగా వ్యవహరించారనే అపవాదు ఉంది. ప్రస్తుతం పని చేస్తున్న కొందరు అదే తీరుగా సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.


ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

ఉర్దూ నేర్చుకుని.. ఉద్యోగం సాధించి

- చిన్నప్పటి నుంచి తెలుగు మీడియంలో విద్యాబోధన
- డీఎస్సీలో రెండో ర్యాంక్ సాధించిన మౌనిక


ఆదిలాబాద్‌టౌన్: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని నిరూపించింది డీఎస్సీ అభ్యర్థి మౌనిక. ఉట్నూర్‌కు చెందిన పవార్ వసంత్‌రావు-రుక్మబాయి దంపతుల మూడో కుమార్తె మౌనిక 1 నుంచి 5వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదువుకుంది. ఆ తర్వాత 6 నుంచి పదోతరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో చేరింది. ఇంటర్‌లో రెండో భాషగా ఉర్దూ తీసుకుంది. డీఎడ్ ఇంగ్లిష్ మీడియం చదివింది. డీఎస్సీ 2024లో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రాసి ఎస్టీ కేటగిరీలో రెండో ర్యాంక్, ఎస్జీటీ ఉర్దూ మీడియంలో 134వ ర్యాంక్ సాధించి కొలువుకు ఎంపికైంది. గురువారం డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలనకు తన తండ్రితో కలిసి హాజరైంది. వసంత్‌రావు మరో కుమారుడు చంద్రశేఖర్‌ను ఇంటర్‌లో ఉర్దూ మీడియం, మరో కుమార్తె నందిని బీఏలో ఉర్దూ మీడియం చదవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కాగా ప్రతీసారి డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో పోస్టులు ఉండగా ఉర్దూ మీడియంలో చదివిన అభ్యర్థులు లేక ఆ పోస్టులు మిగిలిపోతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన అభ్యర్థి ఉర్దూ నేర్చుకొని కొలువుకు ఎంపికైంది.


మౌనిక సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సోన్:మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన శివరాత్రి రవి(33) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రవి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంటివెనుకాల ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లి చీరతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు మధ్యాహ్నం వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు పోలీసులకు సమచారం అందించగా ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రవికి భార్య, కూతురు, ఏడాది వయసున్న కొడుకు ఉన్నాడు. రవి తండ్రి పోశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తాహెర్‌ఖాన్ తెలిపారు.

లింబా(కే)లో..


రమేశ్(ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన బొరిగాం రమేశ్(42) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రమేశ్ మద్యానికి బానిసై ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్డులో దూలానికి ఉరివేసుకున్నాడు. రమేశ్ భార్య సంతోషి ఫిర్యాదు మేరకు పంచానామా చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిరిపూర్ నితీశ్‌కుమార్(22) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన నితీశ్‌కుమార్ తన తమ్ముడు కరణ్‌కుమార్ కొంత కాలంలో సుంక్లి గ్రామ సమీపంలోని సిరిమల్లె మహేశ్ రైస్‌మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి వంట సామగ్రి కోసం ద్విచక్రవాహనంపై వానల్‌పాడ్ గ్రామానికి వెళ్తుండగా మూలమలుపు వద్ద అదుపుతప్పి కింద పడ్డారు. వాహనం నడుపుతున్న నితీశ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా, వెనకాల కూర్చున్న కరణ్‌కుమార్ స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని 108 అంబులెన్సులో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సూచన మేరకు నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఒకరు..


సైదుల సాగర్ (ఫైల్)

కోటపల్లి: మండల కేంద్రానికి చెందిన సైదుల సాగర్ (28) ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ గురువారం ఉదయం షట్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా షట్‌పల్లి గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే చనిపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు ..

మందమర్రిరూరల్: మందమర్రి యాపల్ సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో రాంటెంకి రాజేష్(20) మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన రాజేష్ తన స్నేహితుడు నాగరాజుతో కలిసి తాండూర్ మండలం బోయపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. స్థానిక అంగడి బజార్ సర్వీస్ రోడ్డు వద్ద వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుకాల కూర్చున్న రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రాజేష్ తండ్రి పోషం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

జన్నారం: మోటార్‌సైకిల్‌పై వచ్చిన దుండుగుడు ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన గురువారం జన్నారం పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలం దంతెనపల్లి గ్రామానికి చెందిన చింతకింది రమ గురువారం జన్నారం మండలం దేవునిగూడ గ్రామంలోని తన తల్లి ఇంటికి భర్తతో కలిసి వచ్చింది. పక్కింటి వారితో మాట్లాడుతుండగా మోటార్ సైకిల్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి పుస్తెల తాడును లాక్కెళ్లాడు. గమనించిన భర్త, చుట్టుపక్కల వారు వెంబడించినా తప్పించుకుని పారిపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రాజవర్ధన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. దొంగ దస్తురాబాద్‌వైపు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు.

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు



కైలాస్‌నగర్: రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.రవీందర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు రిజి స్ట్రార్‌గా పనిచేసిన అశోక్ కుమార్‌ను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో హైదరాబాద్ దక్షిణ డీఆర్‌గా ఉన్న రవీందర్‌రావును నియమించింది. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు గురువారం తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చెన్నూర్ మండలానికి చెందిన రఘు, కౌటాల మండలానికి చెందిన యోగి, కార్తీక్, ఆసిఫాబాద్ మండలానికి చెందిన సాయి ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 3 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే జాతీ యస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వెల్లడించారు.

మహిళపై దాడి

తిర్యాణి(ఆసిఫాబాద్): హత్య చేయాలనే ఉద్దేశంతో ఓ వ్యక్తి మహిళపై దాడి చేసి గాయపర్చాడు. ఎస్సై మాధవ్‌గౌడ్, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం సుంగాపూర్ పరిధిలోని దానపూర్‌కు చెందిన టేకం మారుబాయి గ్రామ శివారులో కంది, పెసర్లు సాగు చేస్తోంది. భర్త మారుతో కలిసి చేను వద్దే గుడిసె ఏర్పాటు చేసుకుని ఉంటుంది. గురువారం ఉదయం చేను వద్ద ఉన్న మారుబాయిపై అదే గ్రామానికి చెందిన ఆత్రం రాజు కొడవలితో దాడి చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. వెంటనే తన వద్ద ఉన్న బాడిషా(గొడ్డలి వంటి పదునైన ఆయుధం)తో తలపై దాడి చేశాడు. గాయపడిన మారుబాయి అపస్మారక స్థితికి చేరుకుంది. అనంతరం రాజు ఘటనాస్థలి నుంచి పారిపోయాడు. కొద్ది సమయం తర్వాత అక్కడికి చేరుకున్న ఆమె భర్త.. మారుబాయిని స్థానికుల సాయంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా ప్రారంభమైన నవరాత్రి వేడుకలు


ఘటస్థాపన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావుపటేల్

- శైలపుత్రి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున శ్రీమహాలక్ష్మి, మహాకాళి, సరస్వతి అమ్మవార్లకు అభిషేకం, అర్చన, గణపతి పూజ, సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ముగ్గురు అమ్మవార్లకు అలంకరణ, మంగళహారతి మంత్రపుష్పం పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అక్షరాభ్యాస మండపంలో ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన (ఘటస్థాపన) పూజలు నిర్వహించారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మొదటిరోజు శైలపుత్రి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కట్టె పొంగలి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో విజయరామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు. నాందేడ్ జిల్లాకు చెందిన బాబా జగదీష్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

నిర్మల్‌లో నిషేధిత మత్తుపదార్థాల పట్టివేత

- పక్కా సమాచారంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు
- భారీగా క్లోరాల్ హైడ్రేట్, అల్ప్రాజోలం పట్టివేత
- వీటి విలువ రూ.43 లక్షలు ఉంటుందని అంచనా


క్లోరాల్ హైడ్రేట్ స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నిర్మల్ టౌన్: నిర్మల్ పట్టణంలో నిషేధిత మత్తు పదార్థాలను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన గంధం శ్రీనివాస్ గౌడ్ ఇంటిపై దాడులు చేశారు. 3.3 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. అతడిని వి చారణ చేయగా ఇచ్చిన సమాచారంతో శాంతినగర్‌కాలనీలోని ఓ ఇంట్లో బస్తాలలో నిర్వ ఉంచిన 728 కిలోల క్లోరాల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని సోలాపూర్ శ్రీను అల్ప్రాజోలంను రాజస్థాన్‌లోని రూప్‌సింగ్ వద్ద కొనుగోలు చేసి దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. ఈ అల్ప్రాజోలం 10 గ్రాములతో 100 పెట్టెల కల్తీ కల్లు తయారు చేయవచ్చని తెలిపారు. కిలో అల్ప్రాజోలం విలువ సుమా రు రూ.10 లక్షలకుపైగా ఉంటుందని తెలిపారు. సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ రూ.43 లక్షలు ఉంటుందని వెల్ల డించారు. ఈమేర కు శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలి పారు. గతంలో శ్రీనివాస్‌గౌడ్‌పై ఏడు కేసులు ఉన్నాయని, పీడీయాక్టు కూడా నమోదైందని వెల్లడించారు. దాడుల్లో స్టేట్ ఎక్సైజ్ ఎస్సై బాలరాజు, సీఐ లక్ష్మణ్‌రావు, ఎస్సై వసంతరావు, అభిషేక్ పాల్గొన్నారు.